క్లుప్తంగా

వెంకటేష్‌ను కలిసిన ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్



కరణం వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అశోక్‌బాబు

చీరాల: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను బుధవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ స్పెషల్ ఆఫీసర్ యాదల అశోక్‌బాబు చీరాల ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కొంతసేపు ఆయనతో మాట్లాడారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

చీరాల టౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయమని ఎంపీడీవో నేతాజీ అన్నారు. బుధవారం మండలంలోని వాడరేవు గ్రామంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి 'సిటిజన్ అవుట్ రీచ్' కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీ, సునామీ కాలనీ, లైట్ హౌస్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా సర్వే చేసి వలంటీర్ల పనితీరు, ప్రభుత్వ పథకాల వలన కలిగిన లబ్ధి వివరాలను కుటుంబ యాజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఇంటింటా సిటిజన్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 50 ఇళ్లకు నియమించిన వలంటీర్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చీరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన దాసరి వంశీ (19) తన స్నేహితుడు మహేష్‌లు ఇద్దరూ టాటా ఏఎస్ వాహనంలో గుంటూరు నుంచి వస్తుండగా ఆదివారం బాపట్ల జిల్లా అప్పికట్ల వద్ద చెట్టుకు ఢీకొంది. 108లో గుంటూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న వంశీకి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మహేష్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు.

ముగిసిన వేసవి బైబిల్ శిక్షణ తరగతులు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో పదిరోజులుగా నిర్వహిస్తున్న వేసవి విరామ బైబిల్ శిక్షణ తరగతులు బుధవారం రాత్రితో ఎంతో ఉత్సాహంగా ముగిశాయి. ముందుగా సంఘ కాపరులు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రేమ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఇస్సర్ల బాబురావు దంపతులు, జీవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ప్రదీప్ దంపతులు పాల్గొని చిన్నారులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నపిల్లలు దేవుని స్వరూపులని వారిని చిన్ననాటి నుంచి చదువుతో పాటు దేవుని యందు ఆధ్యాత్మిక చింతనవైపు నడిపించాలని సూచించారు. పది రోజులు పాటు చిన్నారులకు సండే స్కూలు టీచర్లు బైబిల్ గ్రంథంలోని అనేక ప్రవక్తల గురించి విపులంగా వివరించి పరీక్షలు నిర్వహించారు. విజేతలైన చిన్నారులకు డాక్టర్ బాబురావు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేట అశోక్ కుమార్, ట్రెజరర్ యెరిచర్ల రమేష్ బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి రూరల్: శోభకృతు నామ సంవత్సరం ఉత్తరాయణం వైశాఖ మాసం, అశ్వని నక్షత్రం, చదుర్దశి తిథి, సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలనుంచి సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందేతీర్థం, మధ్యాహ్నం 1.00 గంట 1.30 గంటల వరకు పంచాహారతులతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్ షెడ్డు



కాలువ కరకట్టపై చేపల విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు

అడుగడుగునా.. అధికారుల నిర్లక్ష్యం

- కాలువ కరకట్టపై చేపల విక్రయాలు
- మార్కెట్ భవనం ఉన్నా జరగని అమ్మకాలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- మత్తులో నిద్రపోతున్న అధికారులు

వేటపాలెం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారే తప్ప.. వాటిని పరిష్కారానికి మార్గాలు చూపడం లేదు. మాకెందుకులే అన్నట్లుగా మిన్నకుండి హాయిగా కాలం వెళ్లదీస్తున్నారు. మండల గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో మత్స్యకారులు చేపలు, మాంసం విక్రయాలను కాలువ కరకట్టపై జరుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి నిర్మించిన చేపల మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉండిపోయింది. 2017–18లో గ్రామ పంచాయతీ నిధులు రూ. 7.50 లక్షలతో చేపలు, మాంసం విక్రయించుకునేందుకు అనువుగా ప్లాట్‌ఫారం, మంచినీటి సౌకర్యంతో షెడ్డు నిర్మించారు. అయితే ఈ మార్కెట్ షెడ్డు నిర్మించిన తరువాత కేవలం ఒక్క ఏడాది మాత్రమే దీన్ని ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులు వినియోగించుకున్నారు. ఆతర్వాత కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా మార్కెట్ మూసివేశారు. కరోనా సమయంలో గ్రామ శివారులోని రావూరిపేట శివారులోని స్ట్రయిట్‌కట్ కాలువ కరకట్టపై ఊరుకు దూరంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చేపలు, మాంసం విక్రయాలు కరకట్టపైనే జరుగుతున్నాయి. చీరాల–ఒంగోలు ప్రధాన రహదారి స్ట్రయిట్ కట్ బిడ్జి వద్ద కరకట్టపై చేపలు మాసం విక్రయాలు జరుపుతుండటంతో వినియోగదారులు ప్రతి రోజు ఆప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొనుగోలుదారుల వాహనాలు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల నిలుపుదల చేయడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. దీనితో ప్రధాన రోడ్లపై పాదచారులు నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే జంతు కళేబరాలు వేలాడదీసి విక్రయించడంతో పాటు వాటి వ్యర్థాలు అక్కడనే పడేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

లక్షలు పెట్టి నిర్మించిన చేపల మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉండటంతో రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డగా మారింది. మార్కెట్ షెడ్డు ఖాళీగా ఉండటంతో ఆకతాయిలు హల్‌చల్ చెస్తున్నారు. రాత్రి వేళలో ఈ షెడ్డులో చీకటి కార్యక్రమాలు నిర్వహించడంతో ఇటు వైపుగా మహిళలు వెళ్లడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మండల అధికారులు రోడ్డుపై చేపల విక్రయాలు నిలుపుదల చేయించి మార్కెట్ షెడ్డులోనే వ్యాపారాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రోడ్డుకి ఇరువైపుల నిలిపిన వాహనాలు

పోలీసులు ప్రజలతో మమేకం కావాలి



పోలీస్ పికెట్‌ను పరిశీలించి సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



పర్చూరులో మాట్లాడుతున్న డీఎస్పీ

- బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు

బల్లికురవ: పోలీసులు గ్రామాల్లోని ప్రజలతో మమేకం అవుతూ శాంతి, భద్రతలను పర్యవేక్షించాలని బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం మండలంలోని వేమవరం గ్రామాన్ని పరిశీలించారు. 2017 మేలో జరిగిన జంట హత్యలు హత్యలకు సంబంధించిన వివరాలను ఎస్సై వీ వేమన నుంచి తెలుసుకున్నారు. అప్పటి నుంచి గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని పరిస్థితులను ఆరాతీశారు. అనంతరం బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను, స్టేషన్ లోపల రికార్డులను పరిశీలించి పోలీసులతో మాట్లాడారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరు గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ఎస్సై వీ. వేమనను ప్రత్యేకంగా అభినందించారు. ఈయన వెంట సంతమాగులూరు సీఐ ప్రభాకర్ ఉన్నారు.

పర్చూరు (చినగంజాం): మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన తొలిసారిగా పర్చూరు పోలీస్ స్టేషన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిని నిలిపివేసేందుకు సత్వర చర్యలు చేపడతామన్నారు. వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్ చెంచు ప్రసాద్ పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. దీనిలో భాగంగా స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పోలీస్‌లతో మాట్లాడారు. ఈయన వెంట సీఐ, ఎస్సై ఉన్నారు

35 మంది ఉద్యోగాలకు ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో దివిస్ లాబొరేటరీస్ నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మొదటి రౌండ్‌లో 35 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రౌండ్‌లో జరిగిన ఎంపికలో కేవలం 35 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. వీరికి అనంతరం ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపికను ఖరారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సాగుతున్న మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు(చినగంజాం): వేసవిలో తాగునీరు దొరకక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, పాదచారులు పడుతున్న అవస్థలను చూసి రోటరీ సభ్యులు చలించిపోయారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పర్చూరు రోటరీ క్లబ్ ముందుకు వచ్చింది. ఇందు కోసం వారు ప్రయాణికులకు, పాదచారులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు పూనుకున్నారు. రోటరీ ట్రస్ట్ అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు నేతృత్వంలో బొమ్మల సెంటర్‌లో గత నెల 21వ తేదీ నుంచి చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ, మంచినీటిని అందిస్తున్నారు. ప్రతి నిత్యం 600 మందికి పైగా ప్రజలకు పంపిణీని నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో మజ్జిగ పంపిణీని 41 రోజులపాటు కొనసాగించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

రైతుకు అండగా వైఎస్సార్ యంత్రసేవ

- రూ.67 లక్షల యంత్ర పరికరాలు పంపిణీ

చీరాల: అన్నదాతలకు పీడీసీసీ బ్యాంకు సహకారంతో సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించడం శుభపరిణామమని మండల ఏవో సుమతి, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ వాసుదేవ్‌సింగ్, బోయిన కేశవులు, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన రైతులకు పీడీసీసీ బ్యాంకు సహకారంతో 2022–23 సంవత్సరానికి రైతుభరోసా కేంద్రాల్లోని రైతులకు యంత్ర పరికరాలను అందించారు. రైతులకు పెద్ద ట్రాక్టర్లు 2, మినీ ట్రాక్టర్లు 1, రోటవేటర్లు 8, డిస్క్ పెడ్లర్లు 2, తైవాన్ స్ప్రేయర్లు 10, మినీ రోటవేటర్లు 1, కల్టివేటర్లు 4, బ్లేడర్లు 3, ట్రక్ 1, ఇతర యంత్ర పరికరాలు 6 మొత్తం రూ.67.2లక్షల పనిముట్లను రైతులకు అందించారు. దీనిలో బ్యాంకు లోను రూ.32.87 లక్షను పీడీసీసీ బ్యాంకు చీరాల బ్రాంచ్ అందించగా రైతులకు సబ్సిడీ రూ.20.99 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లును పీడీసీసీ బ్యాంకు వద్ద వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో రైతులకు అందించారు. ఈసందర్భంగా ఏవో, బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ అన్నదాతలకు అండగా పీడీసీసీ బ్యాంకు ముందుండి రుణాలను సత్వరంగా అందించిందన్నారు. రైతులను వ్యవసాయంలో రాజులాగా చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడం వలన రైతులకు అన్నీ విధాల మేలు చేస్తుందన్నారు. రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగంచుకుని పంటల సాగులో రాణించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్, కొత్తపాలెం, ఓడరేవు గ్రామాల వీఏఏలు, బ్యాంకు సిబ్బంది, రైతులు ఉన్నారు.



యంత్ర పరికరాలు అందిస్తున్న బ్యాంక్ మేనేజర్, మండల ఏవో

రేపు రావినూతలలో ఉచిత వైద్య శిబిరం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలోగల సాయిబాబా దేవస్థానం వద్ద ఈనెల 19వ తేదీ కిమ్స్ ఆసుపత్రి ఒంగోలు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కాలేషా, తాళ్లూరి రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఎముకలు, కీళ్లు, నరాలు, కంటి సమస్యలు, గుండె, గ్యాస్ ట్రబుల్, సాధారణ వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

కారంచేడు: వాతావరణంలో వచ్చే మార్పులను బట్టి వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కే జెస్సీరాణి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు చెరువుకట్ట మీద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎండలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పనులకు వెళ్లే వారు తప్పకుండా ఉదయం పూట మాత్రమే పనులు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కారంచేడులో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీరాణి

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించటం అభినందనీయమని, క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎస్సై వీ. వేమన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించి ఆటఆడి ఉత్తేజ పరిచారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 52 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించినట్లు నిర్వాహక కమిటి సభ్యుడు బండి నాగార్జున తెలిపారు. 20 రోజులపాటు జరిగే ఈ పోటీలకు మొదటి బహుమతిగా రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10 పది వేలను అందజేస్తున్నట్లు చెప్పారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై

కారుణ్య నియామక పత్రం అందజేత



నియామకపత్రాన్ని అందిస్తున్న వెంకటేష్

చీరాల: చీరాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పండ్లూరి ఎస్తేరమ్మ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుమారుడికి బుధవారం కారుణ్య నియామకం క్రింద పారిశుద్ధ్య కార్మికుడిగా ప్రభుత్వం నియమించింది. ఆ నియామక పత్రాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఉద్యోగం పొందిన జీవరత్నానికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, గోలి జగదీష్, కంపా అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేసి నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పి.సురేష్, ఆర్‌ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు అందిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చట్టాలపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై నాయబ్ రసూల్



రుద్రమాంబపురంలో గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

ఇంకొల్లు (చినగంజాం): చట్టాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంకొల్లు ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మండలంలోని ఇడుపులపాడు ఎస్సీ కాలనీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి సమాచారమైనా పోలీసులకు సత్వరం అందజేయాలని, ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ ఉందన్నారు. పోలీసులతో ప్రజలు స్నేహపూర్వకంగా మెలగాలని ఆయన సూచించారు. అదే విధంగా చట్టాలను గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చట్టాలు ప్రజలకు మేలు చేసేందుకే ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా సైబర్ క్రైం కేసులు ప్రస్తుతం ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, ఎంతో మంది మోసాలకు గురవుతున్నారని చెప్పారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి తెలియజేయాలని సూచించారు. అదే విధంగా దేవాలయాల వద్ద దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయని, గ్రామస్తులు దేవాలయాల వద్ద నిఘా ఉంచాలని, వారు పోలీసులతో సహకరించి దొంగతనాలకు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం: గ్రామాల్లో ప్రజలు స్నేహపూర్వక వాతావరణంలో శాంతియుతంగా జీవనం సాగించేలా ఉండాలని, ఇందుకు పోలీసులు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎస్సై కొమరిశెట్టి సురేష్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని రుద్రమాంబపురం గ్రామంలోని రామాలయంలో గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

బల్లికురవ: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సకాలంలో అందించేందుకు ఎమ్మార్సీ కార్యాలయాలకు విద్యాశాఖ ద్వారా అందజేశారు. ఈ పుస్తకాలను పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు అందజేసేందుకు ఎమ్మార్సీ కార్యాలయంలో పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు ఎంఈవో బీ వీరరాఘవయ్య బుధవారం తెలిపారు. తొలివిడగా మండలంలోని 56 పాఠశాలకు 21,575 పాఠ్యపుస్తకాలు అందాయని రెండో దశలో మరో పదివేల పైచిలుకు అందుతాయని ఎంఈవో చెప్పారు.



పంపిణీకి సిద్ధం చేస్తున్న పాఠ్య పుస్తకాలు

విజ్ఞాన శిబిరంలో ప్రత్యేక తరగతులు

అద్దంకి రూరల్: అద్దంకి శాఖ గ్రంథాలయంలోగ్రంథపాలకుడు చుండూరు సుగుణరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిషు, తెలుగు పద్యాలు, వ్యాసాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సాయి పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయుడు రాజు, రిటేర్డు బ్యాంకు ఉద్యోగి జీఎస్ఎస్ దివాకరదత్తు విద్యార్థులకు బోధించారు. 10వ రోజు నిర్వహిస్తున్న కార్యక్రమానికి 31 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

చండీ యాగానికి తరలి వెళ్లిన భక్తులు



చండీ యాగానికి వెళ్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో నిర్వహిస్తున్న రాజశ్యామల చండీ మహాలక్ష్మి యాగానికి మార్కాపురం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, అందరూ సుభిక్షంగా ఉండాలని గత 4 రోజులుగా యాగం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సుమారు వంద మంది భక్తులు విజయవాడ వెళ్లారు. భక్తులు చండీ యాగంలో పాల్గొనడంతోపాటు దుర్గమ్మ, మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని వచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అప్పన్నాచార్యులు, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి పాల్గొన్నారు. భక్తులు వెళ్తున్న బస్సును చైర్మన్ జెండా ఊపి ప్రారంభించారు.